


# గుణాంతరం

– నవులూరి వెంకటేశ్వరరావు

## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల

### (గత సంచిక తరువాయి)

"అలా వద్దు. మిమ్మల్ని అగౌరవపరిచినట్లు అవుతుంది. అని వెళ్లి మరో వెండి పళ్ళెం, ఫోర్కు, చెంచా పట్టుకొచ్చాడు. ఒక సోడా బుడ్డి కూడా తెచ్చి మూత తీశాడు.

"సోడా నీళ్ళు మీ వంటికి పడతాయిగా?"

"చల్లటి నీళ్ళు తాగను కానీ, చల్లటి సోడాను నిరభ్యంతరంగా తాగుతాను. సోడా నీటి వలన త్రేన్పులు వస్తాయి. ఈ త్రేన్పు చెడ్డ దేమీ కాదు, పుల్ల త్రేన్పులలా. అంచేత ఎదుటి మనిషికి ఇబ్బంది కలిగించేది కాదు అనుకుంటా."

" బిర్యానీ, సోడా కూడా అద్భుతమైన జోడి; సోడా విస్కీలా. సోడాలో దేనితోనైనా జత కట్టగల అణకువ, పొందిక ఉన్నాయి."

"సహజీవనం సాగించే జోడీలలో కూడా అది నిరాటంకంగా సాగాలంటే ఒక భాగస్వామికి సోడా లాంటి గుణం అవసరం."

“మీ దృష్టిలో వివాహ ప్రసక్తి లేని సహజీవనం మంచిదా; కొట్టుకున్నా, తిట్టుకున్నావివాహబంధం మంచిది అంటారా."

" నా దృష్టిలో దొందూదొందే. ఆమెవరో ఇద్దరు పురుగులలాంటి పురుషలతో సహజీవనం చేసి మరొక స్త్రీతో గొడవపడి ఒక భాగస్వామిని వదులుకోవలసి వచ్చింది. అలాంటి జోడిలతో పోల్చి సోడా, బిర్యానీని; సోడా విస్కీ లను అవమానించ కండి."

"నన్ను దృష్టిలో ఉంచుకొని చెప్పండి నేను ఏం చేయాలో."

"అది తమ తద్దినం. ఎలా కావలిస్తే అలా పెట్టుకోండి. ఎవరి సలహా తీసుకోకూడని విషయంలో ఇదీ ఒకటి. లత గారితో సాగుతున్న సహజీవనం మిమ్మల్ని బాగా విసిగించినట్టుంది, వేసారి నట్లున్నారు. తప్పు వ్యవస్థది కాదు, మీది కాదు – లత గారిది."

"పెళ్లి విషయంలోనూ వ్యక్తుల మీదే నెపం పెట్టవచ్చు."

"పెళ్లి అయినా సహజీవనయినా వ్యక్తులు విడిపోవడానికి వీలున్నప్పుడు ఏ రాయి అయితేనేం?"

"రెండూ దిసమొలలతో చెయ్యాల్సిన వెధవపనికి దారి తీయక తప్పవు కదా. స్త్రీపురుషులు ఒకరినొకరు చూసుకుంటూ గడిపితే కడుపు నిండదు. రెండింటిలోనూ అహంభావాలకూ, సాధ్యపడని ఆదర్శాలకు పోకుండా కాళ్ళు నేలమీద ఉంచి సాము చేస్తే ఏ గొడవా ఉండదు. నువ్వా నేనా అంటూ జరిపే కుస్తీపట్లు కాదు కదా సంసారం."

"తాగుబోతులో కూడా జీవన తాత్త్విక దృష్టి ఉంటుందని రాయుడు గారి మాటల వలన తెలుసుకోవచ్చు. అసలు తాగితే గాని తాత్త్వికుడు అవడానికి వీలుండదేమో."

"అందమైన స్త్రీ శరీరంలా రెచ్చగొట్టడం లేదు, నీటి చుక్కల తో తడిసిన ఈ సీసా?"

"నాకు స్త్రీ శరీరంతో ఇంతవరకూ ఎలాంటి అనుభవము కలగలేదు. అయినా స్త్రీ శరీరం రెచ్చగొడుతుందా, మనం దాన్ని చూసి రెచ్చిపోతామా?"

"మీరు ఏమీ అనుకోకపోతే మంచి స్త్రీ ఉంది మీకు పరిచయం చేస్తాను. అనుభవజ్ఞురాలు."

"అలాంటి అనుభవం గురించి నేను తొందరపడదలుచుకోలేదు."

"విప్రనారాయణడి కన్నా, విశ్వామిత్రుడి కన్నా మీకు అధికమైన నిగ్రహశక్తి ఉన్నట్లుంది."

మూడో పళ్లెంలోకి సగం బిర్యానీ తీసి దాంట్లో ఫోర్క్ ను చెంచాలను గుచ్చి నిలబెట్టాడు రాయుడు.

"కానివ్వండి."

"మీ నోటికాడి కూడును మీకు కాకుండా చేశాను. తప్పని పరిస్థితిది."

"చా చా అదేం లేదు. అందులో సగం పారేసేదే. పటేల్ ఇద్దరు మనుషులకు, ఒక కుక్కకూ సరిపడా పంపుతూ ఉంటాడు వెధవ."

"పారేయడానికి బదులు వీధి కుక్కకు పెడుతున్నారు."

"అలా మీరంటే ఈ ఫోర్కుతో పొడుచుకుని చావాలని పిస్తుంది."

అలా మాట్లాడుతూ రాయుడి ముఖకవళికలు పరిశీలిస్తున్నాడు అనంతం. అతని ముఖంలో పొరపాటు చేశానన్న భావం ముందు, తరువాత భయం, ఆ తరువాత కృత్రిమ స్నేహభావం ఒక దాని తరువాత ఒక దాన్ని లాగిపారేసి మరొకటి రావడం అతనికి తోచింది. అనంతరం ఊహించనిది ఒకటి రాయుడులో చూశాడు. అది అతను నవ్వడం.

"మీ పేరు నాకు ఇంకా చెప్పలేదు. చెప్పకపోయినా ఫర్వాలేదు. పేరుతో పనేంటి? గులాబీ అని పేరు పెట్టకపోయినా ఆ పువ్వు పువ్వే కదా – ఆయన ఎవరో పెద్దాయన అన్నట్లు. సుగంధం వెదజల్లడం మానేయదు. దానిలాగే మీరు అందంగా పరిమళిస్తున్నారు. మీ తెలివితేటలే ఆ పరిమళం. గులాబీ కావాలి కానీ దాని సహోదరుడు ముల్లు అక్కర్లేదు అంటే కుదరని విషయం. మీ కఠినత్వం అక్కర్లేదనుకుంటే మీ పరిమళాన్ని వదులుకోవాల్సిందే."

"పోలిక అంతలా నప్పలేదేమో!"

"మనుషులం అంటే పొరపాట్లు చేసేవాళ్ళం అని అర్థం. పొరపాట్లు మనం చేయాలి అని చేసేవాళ్లం కాదు. పొరపాటుకు, తప్పుకు కొంత తేడా ఉన్నా రెండు ఒకటే అని మనకు అనుకూలంగా అనుకుంటే తప్పేంటి? ఒకరి పొరపాటు లేక తప్పును మరొకరు చూసి చూడనట్లు పోతుండటం మానవ ధర్మం – పెద్దగా నష్టం లేనంతవరకూ. పొరపాటుకు ప్రతిఫలం చెల్లించే వీలు ఉండనే ఉంది; చెల్లించవచ్చు చెల్లించక పోవచ్చు వేరే విషయం. మన్ కీ బాత్ ఒకటి చెబుతాను నా మిత్రుడికి. కులం అంటే నాకు అంతరాంతరాల్లో కాస్తోకూస్తో అభిమానం ఉంది. కుల సాంద్రత నాలో లోపించింది. స్వయంకృతాపరాధం కాదది. అందని ద్రాక్ష పట్ల ఉండే చులకన భావం ఏర్పరచుకున్నాను, స్వచ్ఛమైన ఒకే కులానికి నేను చెంది ఉండక పోవడం వలన. ఆ నేపథ్యంలో మీ కులం పట్ల కాస్త అపచారం నేను చేశానేమో. నా కులం పై స్థాయిది, మీది దిగువది అని నేను భావించినపుడో అలాంటి భావాన్ని వ్యక్తం చేసినప్పుడో నన్ను మీరు బజార్లోకి లాగవచ్చు. ఇప్పుడు నేను చేసింది ఆ తప్పు కాదు. ఎవరి కులాన్ని వారు ప్రేమిస్తూ మరొక దాన్ని ద్వేషించడం కూడా ఒక తప్పే. కానీ నా కులాన్నే నేను ప్రేమించనప్పుడు మరో కులం అంటే ద్వేషం ఎలా ఉంటుంది? మీ కులపెద్ద పై కాస్త నోరు జారానంటే అది నోటి దూల కింద వస్తుందే గాని అపచారం క్రింద రాదు. వారంటే వ్యక్తిగత ద్వేషమూ లేదు. మీ కులానికి చందా లాంటి బహుమానం ఇవ్వడానికి నేను సిద్ధం. బసవయ్య గారు మరెవరో బసవయ్య గారనుకుని నోరు జారిన మాట నిజం. అది మిమ్మల్నిబాధించు ఉంటుంది. బసవయ్య గారు చాలా నిజాయితీపరులు అని ప్రసిద్ధి. కాకపోతే వారికి కులగజ్జి హెచ్చు పాళ్ళల్లో ఉందని కొందరు అనగా విన్నా కానీ; నేనెప్పుడూ నమ్మలేదు. నీలో నా మాటలు కలిగించిన అపోహలు తొలగిపోతాయని నమ్ముతున్నాను. నమ్మొచ్చా? ఇద్దరం కలిసి ఈ బిర్యానీ తింటూ, స్కాచ్ విస్కీ తాగుదాం; అలా చేస్తూ అన్ని విషయాలు ముచ్చటించుకుందాం."

" మీ ఉపన్యాసం విన్నాను. నేను కుల గజ్జిని అంటించుకోలేదు; కాకపోతే కులాన్ని వాడుకుంటున్నాను అవసరమయి. తాగుడు విషయానికి వస్తే, ఇంతవరకూ నా జన్మలో దాని రుచిని ఎరుగను. పోను పోను ఏం జరుగుతుందో ఏ జ్యోతిష్కుడికి కూడా తెలియదు. అవసరం తీరుతుందంటే, చావననుకుంటే విషాన్ని నాకడానికి వెనుదీయను. మందుని చప్పరించే అవసరం ఇప్పుడు నాకు లేదు. కానీ మీ గురించి బిర్యానీని తినడానికి నాకు అభ్యంతరం అంతగా లేదు."

"అలాగే కానీయండి. దీని నిండా కోడి ముక్కలు జీడిపప్పులు ఉంటాయి. పాటిల్ గాడు వారంవారం నాకు పంపు తుంటాడు ప్రత్యేకంగా చేయించి. తింటుంటే స్వర్గం బెత్తెడు దూరంలో ఉంటుంది. విస్కీ ఆ బెత్తెడు దూరాన్ని బర్తీ చేస్తుంది."

"వీధి కుక్కలతో దున్నలతో కలిసి తినడానికి మీకు అభ్యంతరం లేదన్న మాట, మీలాంటి మానవుడికి, మాననీయుడికి."

"భలేవారండీ! గతం గతః కాలం ప్రవాహం. అడ్డి వెనక్కు ప్రవహింప చేయలేం. గతాన్ని పట్టుకుని వేలాడడం మీలాంటి విజ్ఞులకు తగదు.ప్రతి అవమానాన్నీ మనసు మరుగున పడనీయాలి; ఏ గాయానికి మానుతుంటే అడ్డుపడరాదు. మీ గొప్పతనం తెలియక మీరు ఏ పని మీద వచ్చారో ఎరుగక పలు మాటలు అన్న విషయం నిజమే. తప్పు చేసినప్పుడు నేను తప్పు చేశా అని ఒప్పుకో గల ఖలేజా నాలో ఉంది," చాతి మీద కొట్టుకుంటూ అన్నాడు రాయుడు కాస్త ఆవేశంగా.

"చావాలనిపిస్తే, ఫోర్కుకన్నా నా దగ్గిరున్న కత్తి బాగా ఉపయోగపడుతుంది. వాపసు చేయనక్కరలేదు."

"చేతనవ్వాలే గాని చేతలేగాక మాటలూ మీదగ్గిర నేర్చుకోవాలి."

"పొగడ్తలంటే నాకు ఇష్టం ఉండదు, భయం కూడా," అన్నాడు పెదవి విరిచి భుజాలు ఎగురవేస్తూ.

"మీది చాలా విచిత్రమైన వ్యక్తిత్వం."

"ఇదీ ఒకవేళ పొగడ్తే అయితే దీన్ని నేను నిరాకరించక తప్పదు."

"మీది భయంకరమైన మనస్తత్వం. మీ అందానికి అది తోడయింది నిప్పుపై ఆజ్యంలా," ద్వేషాన్ని దిగమింగుకుని చిరునవ్వుతో అన్నాడు రాయుడు.

"పొగడ్తన్నే అనిష్టం అన్నా కానీ తెగడ్తన్నే ఇష్టం అని నేను అనలేదనుకుంటున్నా. నాకు బిరియానీ కొంచెం చాలు. ఇందులో నుంచీ సగం తీసి మీరు తినాలనుకుంటే తిన వచ్చు, లేకపోతె వీధికుక్కకు పారెయ్యవచ్చు. మీరు తింటూ మధ్యమధ్య మీకిష్టమైన పానీయాన్నిసేవించుకోవచ్చు."

"మన స్నేహం కయ్యంతో మొదలవడం తమాషాగా ఉంది; మీకు ఎలా ఉందొ నాకు తెలియదు."

"నా మాటలు కఠినంగా ధ్వనించవచ్చు గానీ మీరు నన్ను ఎంత మచ్చిక చేసుకోవాలని చూసిన నా ధ్యేయం అణుమాత్రముగా కూడా దురదృష్టవశాత్తూ మారదు. నేను అమ్ముడుబోయిన మనిషిని."

"రాజీపడక్కరలేదు; అన్ని విషయాలూ కూలంకషంగా మాట్లాడుకుందాం. నా మనవి ఏమిటంటే అతి కష్టమైన పనిని నాచేత చేయించకండి. చేసిన మంచిపని పై లోకంలోనన్నా ఉపయోగపడక పోదు మీకు," మాటలు దీనంగావున్నాయిగాని అది కనబడకుండా అన్నాడు.

"కొంత కష్టం తప్పదు, రాయుడు గారు. నేను మీ ఫ్లాటు ముందు వరండాలో నిలబడినప్పటి నుంచి ఎంతకష్టపడవలసి వచ్చిందో మీకు నేను వర్ణించక్కరలేదు. నాది కష్టమైన పని కాకుంటే నన్ను ఈ పనికి నియోగించినవ్యక్తి తానే చక్కబెట్టుకోడానికి వీలయ్యేది."

"మనం కలిసి బిరియానీ తింటున్నవేళ మధ్యమధ్య మీరు సోడా, నేను విస్కీ తాగుతున్న ఈ శుభవేళ నాలో రేగుతున్న ఒక భావోద్రేకాన్ని మీకు తెలియజేయకపోతే నేరం చేసినవాడినవుతాను."

"పాపాలంటే నాకు పెద్ద లెక్కలోనివి కాదు. ఆ బాపతు చేయకపోతే మనకు కావలసిన విధంగా జీవించడం సాధ్యపడదు అన్న పాఠం ఒక అజ్ఞాత శక్తి, మొసలిని పోలినది నాకు నేర్పింది. పాఠాలు ఎవరు చెప్పినా అవి మనకు మేలు చేస్తాయని మనలో నమ్మకం కలిగితే తప్పక నేర్వాలి. మీలో చెలరేగుతున్న భావోద్రేకాన్ని నాతొ నిక్షేపంగా పంచుకోవచ్చు."

"మన చిగురిస్తున్న స్నేహానికి ఆ పని కీడుచేయదని మీరు హామీ ఇవ్వాలి."

"ఇచ్చాను."

"నా జీవితం గురించీ అన్ని వివరాలు సేకరించిన మీరు నన్ను హత్య చేయడానికి అర్హులు. దయనీయంగా – భోగించడం [రమించడంతో సహా], లంచాలు పుచ్చుకోడం, ఆస్తులు కూడబెట్టుకోవడం వగైరాలు మాత్రమే తెలిసిన నాకు హత్యలు చేయడం, చేయించడం రాదు. రెండు భ్రూణహత్యలు మాత్రం చేయించాను; నా సహచరి పోరువల్ల."

"మీరు పదేపదే స్నేహం గురించి మాట్లాడకండి; నా నగ్న శరీరం మీద గొంగళీలు పదివేలు పాకుతున్నట్టనిపిస్తుంది. మన మధ్య కేవలం వ్యాపారసంబంధమేగాని మరో దానికి చోటులేదు; మీకూ లత గారికీ ఉన్నటువంటిది. పనై పోయినతరువాత ఎవరికి వాళ్ళం, రైలుదిగిపోయిన ప్రయాణీకుల్లా. ఒకరికొకరం గన్నయ్యగాళ్ళం."

"మీరు ఇలా నిర్మొహమాటంగా మాట్లాడుతుంటే వీనులకు విందుగా వుంది. వ్యాపారం అయిన తరువాత చెరొక దారి అన్నారు. ఎందుకో నాకు ఆ మాటలు చాలా నచ్చాయి. ఒక దిగులును నిర్మూలించాయి. మన మధ్య నలుగుతున్నది నిజానికి వ్యాపారం కాదని మీకే కాక నాకూ తెలుసు. దానికి ఏ పేరు పెట్టుకుంటేనేమిగాక? వ్యభిచారమన్నా, బ్లాక్మయిల్ అన్నా ఆ పనివిలువ పెరుగుతుందా, తరుగుతుందా? ఇప్పుడు తలపెట్టినదానిలో నష్టపోబోతున్నది నేను, లాభపడబోతున్నది మీరు."

"అప్పనంగా అనుభవించే దాన్ని కోల్పోవడం నష్టం కిందికి వస్తుందని ఏ వ్యాపార సూత్రాలలోనూ, వ్యభిచార సూత్రాలలోనూ చదవలేదు."

అనంతం రెండే నిమిషాలలో తన వంతు దానిని తిని, సోడా తాగి, త్రేన్పును ఆపుకున్నాడు. రాయుడు తిన్నది మూడు చెంచాలు, తాగింది సగం సీసా. విషం అందుబాటులో ఉంటె అదీ తాగేసి ఉండేవాడు. ఒక వీధికుక్కకు లొంగిపోయి ఎదురుగా కూర్చుని నానామాటలూ అనిపించుకుంటూ విషం మాత్రమే తాగనగును; సుర కాదు. కొండంత

అహాన్ని దిగమింగితే అది గొంతుకు అడ్డుపడుంది. రాయుడి నరకానుభవాన్ని సమగ్రంగా గ్రహించాడు అనంతం. అనంతం వాచీ చూసుకున్నాడు. రాయుడు ఇచ్చిన కాలపరిమితి ఏనాడో ప్రవాహంలో కొట్టుకుపోయింది.

"కోడి ముక్కలు, జీడిపప్పు ఘనంగానే ఉన్నాయి," అన్నాడు అనంతం.

"పటేల్ గాడికి నా మీద అధిక ప్రేమ. మనం అసలు విషయం వదిలేసి అనేక విషయాలు మాట్లాడుకున్నాం. లత ఏ క్షణాన్నైనా రావచ్చు."

"నేను గొంతెమ్మ కోర్కెను కోరడంలేదు. లక్ష రూపాయల అవసరం పడింది; మా కులపెద్దకు బాకీపడ్డాను. రెండోది మీరు ఈ ఊరి నుంచీ తక్షణం బదిలీ చేయించుకుని వెళ్ళిపోవాలి."

తాతలనాటి తరగని ఆస్తిని, స్వార్జితాన్ని, అవినీతి సొమ్మునూ అనుభవిస్తూ దాచుకుంటూ బతుకుతున్నాడు రాయుడు. అనంతం కోర్కె అల్పమైనదా, అధికమైనదా అన్న సందిగ్ధంలో పడ్డాడు. అనంతం అలా కోరడం అన్యాయమని వేరే చెప్పక్కరలేదు. అనంతం డబ్బడుగుతాడని రాయుడు ఊహించిందే. బదిలీకోర్కెఅధికమైనదా అల్పమైనదా అన్న ప్రశ్న సందిగ్ధంలో పడేసింది. ఈ ఊళ్ళో ఉద్యోగం చేసుకుంటూ ఉండటం అనంతానికి కాక అతన్ని పంపిన వ్యక్తికీ ఏవిధమైన ఇబ్బందిని కలిగిస్తుందో అర్థంకాలేదు. రంగ మీద అనుమానం వచ్చింది. తానూ ఏ విధంగానూ రంగాకూ లతకూ అడ్డుపడటంలేదు. వాళ్లకు పరిమితిలేని స్వేచ్ఛకావాలేమో. లతకు రంగ ఈ పనికి పూనుకున్నాడన్న విషయం తెలుసో తెలీదో? అడిగితె? అలా అడగడం అతనిమీద అతనికే అసహ్యం పుట్టించే విషయం. తానున్నంత వరకూ వాళ్లిద్దరూ ఈ ఇంట్లో కాలక్షేపం  చెయ్యలేరు. వాళ్లకు వేరే ఇళ్ళు దొరకవా? వేరే చోట్లు దొరకవా? ఇంకెవరికి తానూ అడ్డు? సహచరులకు ముట్టవలసిన లంచం డబ్బును నిజాయితీగా వాళ్లకు వెళ్లేలా చూస్తున్నాడు. ఒక రౌడీని వినియోగించి మరీ తనను పక్కకు తొలిగించే ప్రయత్నం చేసేంత సమర్థులు కాదు కార్యాలయంలోని సుందరంగాడు, చంద్రంగాడు. లంచం తీసుకోడానికి అర్థరాత్రి రోడ్డుమీద నడవడానికి వేయి జాగ్రత్తలు తీసుకునే దద్దమ్మలు వాళ్లిద్దరూ.  సుమతి మొగుడి హస్తం ఉందా? వాడి ఏ సమర్థతమీదా రాయుడికి నమ్మకం ఎప్పుడూ లేదు.

"లక్షరూపాయలు ఆకుల్లో పూవులతోపెట్టి పెట్టి ఇస్తా, అది కష్టతరమే అయినా. ఈ ఊరు ఒదిలిపొమ్మనద్దు. అదేమీ సబబో ఆలోచించండి. కారణం కూడా చెప్పండి. అన్యాయంగా ప్రవర్తించవచ్చుగాని నిర్హేతుకంగా ఉండకూడదు. ఈ ఊరు నుంచీ బదిలీకి పై అధికారులు తేలికగా ఒప్పుకోరు. మీరు రెండు వరాలు కోరడం దారుణం కూడా."

"ఎవడులేకపోయినా ఏ కార్యం గాని, కార్యాలయంగాని ఆగిపోదు. మీరందరూ బదిలీకల ఉద్యోగస్థులు కదా. మూడు నాలుగేళ్ళకది తప్పదు. పై అధికారులకు తగినంత మొట్టచెబితే ఒకటి రెండు సంవత్సరాలు అధికంగా ఉండటానికి ఎలాగూ అవకాశం ఉంది. ముందు బదిలీకి ఆ సౌకర్యం ఉండకపోదు. నేను ఉద్యోగిని కాకపోయినా కార్యాలయాలు ఎలా అఘోరిస్తున్నాయో నాకు తెలుసు. రేపు మీ గుండె పరిస్థితి బాగాలేక ఆగిపోతే మీ కార్యాలయం కూకటివేళ్లతో సహా పక్కకు ఒరిగిపోతుందా?"

"లత నా మెడకు గుదిబండ. నా కొడుకు రంగని ఒదిలి మరో ఊరు రాదు."

"రంగా లత గార్ల మధ్య చిచ్చుపెట్టడానికి రుసుము చెల్లించి నన్ను వాడుకో వచ్చు."

"నేను సిద్ధంగా లేను దానికి. తగిన కారణాలున్నాయి. మీ మీద అతి విశ్వాసం కలిగి ఉండే హక్కు మీకుండవచ్చుగాని, నాకు ఉండాలని లేదు. వాళ్ళిద్దరినీ వేరు చేసే అవకాశం సూదిమొనంత ఉన్నా బూతు సినిమాలు చూస్తూ, బిరియాని తింటూ, మందు తాగుతూ బాధను దిగమింగుకునేంత వెర్రి వెంగళాయిని కాదు. ఒక స్నేహితుడిగా [మీరు నా స్నేహ హస్తాన్ని నిరాకరించినా] ఒక సలహా. ఏమిటంటే జీవితంలో ఎవడిని తక్కువ అంచనా వేయకండి."

"అంత ఘాటుగా లత గారు రంగాన్ని ప్రేమించి ఉంటె మిమ్మల్ని వదిలించుకుని ఉండొచ్చుగా; రంగాతోనే సహజీవనం చేసుకో వచ్చుగా?"

"అలా చేసేట్టయితే రంగా గాడి పెళ్ళాం లతను నరికేస్తుంది. రంగా గాడికి పైసా ఆస్తిని దక్కనీయదు, ఆంతా దాని పేరే ఉండటం చేత. అది ఐదేళ్ల క్రితం దాకా బాక్సింగ్ చాంపియన్. రంగా గాడూ బాక్సర్. ఆ ఆట వాళ్ళిద్దర్నీ పాముల్లా పెనవేసింది. రంగా గాడు లతతో తిరగడానికి ఆమెకు అభ్యంతరం లేదు. మరో స్త్రీతో కాపురానికి పూనుకోనంత కాలం. నా ఇంటికి వచ్చి నన్ను బ్లాక్మెయిల్ చేస్తున్నట్టు వాడింటికెళ్లి నీవు చేస్తే వాడు డ్రమ్ముడు ఆమ్లంలో పడేస్తాడు మిమ్మల్ని ముక్కలుగా కత్తిపీటతో తరిగి. దవడ ఎముక, దానికున్న పళ్ళు, ముక్కుదూలం బలహీనపడ్డాయిగాని వాడి జబ్బల పుష్టి ఇంచుమించు గతంలోలానే ఉందని నా అంచనా. గతంలో ఒక కుర్రాడికి తర్ఫీజు ఇస్తూ, పొరబాటున కణతమీద కొట్టి హత్య చేశాడని రుజువులు దొరకని పుకారు. దాంట్లో నుంచీ బయటపడటానికి సంవత్సర కాలం గడ్డాలూ మీసాలు పెంచి తిరిగాడని, వాడి అసలు పెళ్ళాం తన సొగసునంతా అతిపెద్ద పోలీసు అధికారికి, మంత్రికి ధారపోసి వీడిని రక్షించిందని అనుకుంటారు. వృత్తిరీత్యా వచ్చిన రోగమేమో ఎక్కడ ఎవరి దౌడ కనిపించినా వాడి పిడికిలి బిగుసుకుంటుంటుంది. ఎంత మొండిధైనా లతకు వాడంటే ప్రాణ భయం ఉంది. వాళ్లిద్దరూ సుఖపడుతున్నపుడు వాడిని తేలిగ్గా చంపెయ్యొచ్చు అన్న నమ్మకమూ ఉంది; కాకపోతే గుండె కోడి గుండె. అది ఊరొదిలి పోతానంటే వాడొప్పుకోడు. లత తనను వదిలించుకోవాలని చూస్తోందన్న అనుమానం కలిగితే రంగా గాడు దాన్ని సముద్రంలోకి తోసేస్తాడు."

"అన్ని ఆంతరంగిక విషయాలూ లత గారు ఏ మైకంలోనో మీకు చెప్పి ఉండాలి; లేకపోతె అంత సవివరంగా మీరు చెప్పలేరు. లేదూ ఈ కథ మీ స్వకపోల కల్పన కావచ్చు."

తాగుడు మైకంలో గాడితప్పిన రాయుడి మనసు తన భార్య గురించీ ఒక వీధికుక్క అలా మొరగడం – సందేహాలూ, సంకోచాలూ, భయాలూ అన్నింటినీ విదిలించి అతనిని రెచ్చగొట్టింది. లేచి బలంగా అనంతం దవడ మీద రాయుడు కొట్టాడు. అనంతం కుర్చీలోనుంచీ కిందికి దొర్లాడు. జేబులోకి చేయిపోనిచ్చి కత్తిని రాయుడికి ఎక్కుపెట్టాడు.

"ఈ సంఘటనను మరిచిపోండి, అనంతం గారు. భార్య గురించి అవమానకరంగా [వేరే] మగాడో కాదో తెలియనివాడు మాట్లాడితే తమాయించుకోడం అసాధ్యం."

"నిజమే, రాయుడు గారు, ఒక భర్త మనసును అర్థంచేసుకోగలను నేను ఇంకా ఎవరికీ భర్తను కాకపో యినా. చావకొట్టి చెవులు మూసినట్టుంది మీ చర్య.

"మీ ఉద్దేశంలో బ్లాక్మెయిల్ మీ  జీవితంలో ఒక భాగమా?"

"అవును. కాదేదీ జీవనానికి అనర్హం."

"కవిత్వం చెప్పకండి ఎవరిదో కాపీ కొట్టి మరీ."

"బ్లాక్మెల్ చెయ్యడం కళగా మీకు మీ తల్లిగారి గర్భంలో ఉన్నపుడే అబ్బి ఉటుంది."

"కీచకులతో వ్యవహారం తేల్చుకోవాలంటే సకల కళలూ అభ్యసించిఉండాలి."

"కీచకుడెవడు?"

"విరాటరాజు బామ్మరిది; సుధేష్ణ  అనుంగు సోదరుడు."

"భారతం నేను కాస్తో కూస్తో విన్నానండీ; ఎవరిని ఉద్దేశించి ఆ పేరును వాడుతున్నావు అని అడిగా."

"ప్రతి పురుష పురుగులో కీచకాంశ ఉంటుంది కదా. కొందరిలో పెద్దది, మీలాంటి వాళ్లలో పెద్దది."

“స్త్రీలలో శూర్పణకాంశం ఉండదా?"

“కాదనడానికి నా అనుభవం సరిపోదు."

"నేను  తిరుగుతున్న భార్య మీదనన్నట్టు తెగ బాధపడుతున్నావేంటి?"

"నాకు భార్య లేదు. కనీసం ఉంపుడుగత్తెకూడా లేదు."

"మొగుడు?"

అనంతానికి విపరీతమైన కోపం ఒచ్చింది. కత్తి రాయుడు గుండెలోకి డిగెయ్యాలన్నంత కోపం వచ్చింది. తన కోపమే తనకు శత్రువు అని సమాధానం చెప్పుకున్నాడు.

"మీ సమయం వృథాచేయడం నాకిష్టంలేదు. అలాచేయడంలో నా సమయమూ వృథా అవుతుంది కనుక."

"మీ వయసు చూస్తే పాతికుండదు. ఇంతలోనే మీరు ఇంతలా ఎలా రాటుదేలారు, బ్రో?"

"దేముడి మీద మీకు నమ్మకం ఉంటె దేముడిని అడగండి. దయ్యం మీద మాత్రమే మీకు నమ్మకముంటే దాన్ని అడగండి, బ్రో."

"నేను దేముడిని కొలుస్తా. దయ్యాన్ని కొలవను; అదంటే భయంకూడా. మీలోని పరిణామానికి తప్పక దయ్యమే కారణం అయుంటుంది."

"మీలోని పరిణామాలన్నీ దైవనిర్ణయాలు కాబోలు."

"దైవం ఒక అద్భుతమైన శక్తి. అది పంచేంద్రియాలు ఇచ్చి వాటితో అన్నిరకాల సుఖాలను అనుభవించమని చెప్పినట్టు నేను భావిస్తా. అవిచ్చి వాటిని జయించమని అంటాడా? అనడనుకుంటున్నా."

"నీతీనియమాలతో వాటిని నియంత్రించాల్సిన పనిలేదంటారు! పోనీ సామాజిక న్యాయాన్యాలు అన్న పదాలను ఉపయోగిద్దాము. వాటికన్నా మనం లొంగాలా వద్దా? మీకు భార్యలేదు కాబట్టి సరిపోయింది. తల్లి, అక్క లేక చెల్లీ ఉన్నారో లేదో కూడా తెలియదు. ఒకవేళ వాళ్ళుండుండి వివాహేతర సంబంధాలు ఏర్పరుచుకుని మీ తత్త్వాన్ని కవచంగా ధరించుంటే – చూస్తూ, పట్టనట్టు ఊరుకుంటారా ?"

"ఊరుకోను. అయినా నా వాళ్ళ విషయాలకు వచ్చేసరికి వాటిని ఆశ్రయిస్తా. నేను కృపారావు భార్యను బలవంతం చేయలేదు. ఆమె ఇష్టపడ్డ తరువాతే నా దగ్గిరికి వచ్చింది. ఏ కారణాలవలన ఇష్టపడింది అన్నది అప్రస్తుతం. ఇరువురం కలిసి ఆనందిస్తున్నాం," మొండిగా వాదించాడు రాయుడు.

"ఈ విషయం తెలిస్తే కృపా గుండె ఆగి చస్తాడని మీరు భావించలేదు; అతనంటే చులకనభావం వలన."

"వాడు చస్తాడా బతుకుతాడా అన్నవిషయం సుమతికి తెలియదా? కృప గురుంచి సుమతికన్నా నేను అధికంగా ఆలోచించాలా? వాడు చస్తాడనే గుట్టుగా వ్యవహారం సాగిస్తున్నాను."

"బీచ్ రోడ్డులో నడుస్తూ ఆమె పృష్ఠభాగాన్ని తాకుతుండటం చాటుగా సాగుతున్న వ్యవహారమా?"

"మా వ్యవహారం కృపకు తెలియదని నీకు తెలియదు."

"కృప బతికుండటమే అతనికి తెలియదన్నదానికి తార్కాణం," అనంతం అన్నాడు పక్కకు చూస్తూ.

"తెలిస్తే చస్తాడని మీకు అంత గట్టి నమ్మకం ఎందుకుందో?"

"అతని తత్త్వం అదీ అని ఊహించి."

"లతను నా స్వంత ఆస్తిగా, బానిసగా నేను భావించకపోవడం కూడా నేను ఆమె రంగాలతో ఏర్పరచుకున్న సంబంధానికి నా ప్రాణం ఒదిలెయ్యకుండా సర్దుకుపోగలుగుతున్నా. వ్యక్తిగత సేచ్ఛను గౌరవించాలి. నేను సుమతితో కలుస్తున్న విషయం లతకు తెలుసు. ఆమె కూడా ఆ విషయంలో ఉదార వైఖరిని అలవరుచుకుంది. మనం ఆధునికులం. కృపారావుకు చాతనయ్యి తానూ ఒక వివాహేతర సంబంధం ఏర్పరచుకుంటే సుమతి ఉరేసుకోదు. మానవ సంబంధాలు చిత్రవిచిత్రమైనవి. వాటిని క్రమబద్ధీకరించలేము."

"స్వేచ్ఛకూ, విచ్చలవిడితనానికీ తేడాలేదా, రాయుడు గారూ?"

"ఏది ఏదో వ్యక్తిగత అభిప్రాయం మీద ఆధారపడి ఉంటుంది."

"నాకు ఓపిక లేదు, రాయుడుగారు. నేను వెళ్లిపోతున్నా. మా బంధువు బసవయ్యగారిని కలవడమొకటే మీరు నాకు వదిలిన ప్రత్యామ్నాయం," అని వచ్చిన పని సాగుతోందని కాస్త నిరుత్సాహ పడ్డాడు అనంతం.

చేత్తో ఆగమని, పళ్ళు రాలేట్టు బిగించి సైగచేశాడు రాయుడు. వెళ్లి బీరువా తీసి లక్ష రూపాయల కరెన్సీ నోట్లను సోఫాలోకి విసిరాడు కుక్క ముందు ఎముకలు విసిరినట్టు. నోట్లు చూస్తుంటే నోటితో అందుకోవాలనిపిలించింది

అనంతానికి. నిగ్రహించుపాడు. కొన్ని క్షణాలపాటు వాటిని లెక్కలేనట్లు చూశాడు తన కులపెద్దలా. రెండు లాభాల్లో ఒకదానితో అతను రాజీపడ దలచుకోలేదు.

"మీరు కష్టపడో పడుకో సంపాయించిన ఆ డబ్బు నాకెందుకు? ఒకడి గురించీ వేదాంతరావు అనేవాడు చెప్పినట్టు, మీరు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటూ డబ్బు ఆర్జిస్తున్నారో. మనిద్దరికీ ఏ విలువలు లేవు లక్ష్య సాధన తప్ప. మీ డబ్బును మీ దగ్గిర ఎక్కడ వీలయితే అక్కడ దాచుకోండి. నా అసలు లక్ష్యం వేరు. విలువలు కాని విలువలు నాకున్నట్టున్నాయి. అందులో ఇచ్చినమాటను నిలబెట్టుకోవాలన్న అహంకార పూరిత పట్టుదల ఒకటి. నాకూ త్యాగంచేయ్యడం వచ్చు; అంటే కక్కూర్తిపడకుండా ఉండగలగడం – అవసరమయినప్పుడు."

"లేదు, అనంతం గారు; మీరు కోరిన రెండవ వరానికి కూడా ఒప్పుకుంటున్నా. నిజానికి బ్లాక్మైల్ అనే ఆయుధాన్ని ప్రయోగించి ఒప్పించారు. ఇప్పుడే పై అధికారులతో మాట్లాడతా; లంచం పారేస్తా; లేని కులాన్ని వాడుకుంటా; ముందు నెలరోజులపాటు శలవలో పోతా. ఇకమీరు తగలడొచ్చు."

అనంతం రాయుడిని బెదరగొట్టి వచ్చిన మరుచటి రోజు అనంతం, కృపా సముద్రపొద్దున కాపు కాచారు.

సుమతి యథావిధిగా వచ్చి నిలబడింది. పది నిమిషాలు ఎదురు చూసింది. రెండు సార్లు ఫోనుచేయ్యడం కనిపించింది. ఎంత భరోసాగా అనంతం చెప్పినా కృపా సందిగ్ధంగా ఉన్నాడు. అనంతానికివ్వాల్సిన డబ్బులో మిగతాది ఇవ్వలేదు. భార్యతో అనుభవం తరువాత తన కళ్ళనే నమ్మేట్లు లేడతను. పదినిముషాల తరువాత ఆమె ఒంటరిగా నడవడం కనిపించింది. సొంత భార్య వివాహేతరసంబంధం కలిగి ఉండటం ఒక రోకలి పోటయితే, జంటను విడదీయడానికి లక్ష మొత్తాన్నీ అపరాధరుసుములా చెల్లించుకోడం రోకలి పోటు మీద మరొక రోకలిపోటేకాక తలదించుకోవాల్సిన విషయం. ఈ నమ్మని గుణం భార్యపట్ల ఆదిలో ఉండుంటే ఆమె చెయ్యిజారిపోవడాన్ని నిరోధించగలిగేవాడా? ఏమో! అనుకున్నాడు తన మీద తనకే నమ్మకం నశించి.

"నిన్న పాముపుట్టలో దూరి రెండు గంటల భయాందోళనలకు గురయ్యాను; మీరిచ్చిన డబ్బు బఠాణీలు," అన్నాడు అనంతం మరోసారి.

తాను కేవలం డబ్బుకు కక్కూర్తిపడి ఆ పని చేయలేదన్న నిజం అనంతానికి తెలుసు. వ్యాపారం చేస్తూ నష్టానికి చేస్తున్నాననే వ్యాపారి వైఖరి అవలంబించాడు అనంతం. అసలు పథకం పారితే తన జీవితంలో పెనుమార్పు వస్తుందన్న ఆశతో ఉన్నాడు.

కృపా అనంతం 'కష్టనష్టాల' గురించీ పట్టించుకోలేదు. ఇంతకాలం మబ్బుగాడిలా బతికిన కృపలో జ్ఞానం బద్ధకంగా ఒళ్ళువిరుచుకుంటోంది; అది చివరకు ఏ దిశకు మళ్ళి ఏ దశకు చేరుతుందో అతనికి తెలియదు.

"కృపా గారు, మిమ్మల్ని శంకలేవో వేధిస్తున్నట్లున్నాయి. మీ డబ్బును మీ దగ్గిరే దివ్యంగా ఉంచుకోండి, నాకివ్వక్కరలా. మన ఒప్పందాన్ని రద్దుచేసుకోవాలని మీకుంటే నేను సిద్ధం. నేనూ రాయుడితో నా ఏర్పాటును నీటిపాలు చేసుకోగలను. రాయుడు నా శత్రువు, మీరు బంధువూ కాదు నాకు. కాస్తో కూస్తో మీతో స్నేహంలాంటిదుంది; అదేమీ నన్ను ఇబ్బందిపెట్టదు."

కృపా బెంబేలెత్తాడు. తోలుసంచీలో నుంచీ తీసి నోట్లకట్టలు ఇచ్చాడు.

"మీరేమీ కంగారుపడకండి. నేను చేసినపని ఫలితం చూపకపోతే మీ డబ్బులో రూపాయ కూడా ఉంచుకోకుండా మీకు పువ్వుల్లోనో ఆకుల్లోనో ఉంచి వాపసు చేస్తాను. నన్ను నమ్మడానికి ప్రయత్నించరూ? డబ్బుకు బానిసలం మనం. బానిస తన యజమానిని ప్రేమించడు, ద్వేషిస్తాడు. కానీ ఈ యజమానినిపై మనం (దాని బానిసలం) మన భార్యాబిడ్డల మీద కన్నా ఎక్కువ అనురాగాన్ని పెంచుకుంటాం. మామూలు బానిస బానిసవడానికి మనం డబ్బుకు బానిసలుగా మారడానికి భిన్నమైన కారణాలున్నాయి."

ఒకవేళ రాయుడు తనతో వచ్చిన ఒప్పందానికి కట్టుబడిఉండకపోయినా, అనంతం రాయుడి డబ్బు రాయుడికి ఇవ్వక్కరలేదు. కృపా డబ్బుమాత్రమే అనంతానికి దక్కదు. రాయుడు కట్టుబడి ఉండని పక్షంలో తాను వేసుకున్న తరువాతి ఎత్తుకు వీలుండదు; అది వెలకట్టలేని నష్టం. అందుచేత కృపా సంగతేమో కానీ అనంతం ఎక్కువ ఆందోళనగానే ఉన్నాడు. ఇప్పుడు ఆమె ఒక్కర్తే వెళ్లడం – బహుశా కృపాతో సమంగా లేక ఎక్కువగా – అనంతానికి ఆనందాన్ని ఇవ్వాలి.

రెండోరోజు ఎవరికి వాళ్ళు అనంతం, కృపా బీచికి వెళ్లి ఇద్దరూ కలిసి వాళ్లకు కావలసినదాన్ని చూసి సంతోషించారు. ఆ రోజున అనంతం రాయుడికి ఫోను చేసి ధన్యవాదాలు చెప్పాడు. మరుసటిరోజే ప్రేమలత, ఆతను బెజవాడ వెళ్ళిపోతున్నారట; రెండు నెలల శలవు దొరికింది. ప్రేమలత గారు అభ్యంతరపెట్టలేదా అని అడుగుదామని నాలుక చివర దాకా వచ్చింది. సంభాళించుకున్నాడు అనంతం. ఏదీ అతిచెయ్యకూడదు; చచ్చిన పామును చంపలేము, వేస్తే అది అనవసరపు దెబ్బవుతుంది; చెదారం మొహం మీద త్రుళ్ళవచ్చు. మాటల్లో కూడా మర్యాద చూపించాడు రాయుడు. అనంతం రాయుడికి ఊరటగా ఇలా అన్నాడు –

"అవినీతికి సంబంధించి మీకు ఏమన్నా పనిబడితే చెప్పండి; బసవయ్య గారితో నేను దానిని మీకు చేయించిపెడతాను; నాకు వేరే డబ్బు అక్కరలేదు. ఏ విషయం మనిషిని ఎక్కువకాలం బాధించదు. ఇది మనిషికి ఇవ్వబడిన వరం."

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS